క్లుప్తంగా

రైతులతో ఆర్డీఓ ముఖాముఖి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రంగస్వామి

సంబేపల్లె : మండలంలోని శెట్టిపల్లె పంచాయతీ వల్లబండపల్లెలో ఆర్డీఓ రంగస్వామి రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని బహుదానదిపై నిర్మించిన జర్రికోన ప్రాజెక్టు నీరును లిఫ్ట్ ఇరిగేషన్ ద్వార మండలవ్యాప్తంగా ఉన్న చెరువులకు నీరు అందిస్తామన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే నివేదికలు తయారు చేసిందన్నారు. కాలువలు రైతుల భూములలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మహేశ్వరీబాయ్, నాయకులు రమేశ్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్రమణ, ఆనంద్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కడప రిమ్స్‌కు వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అరుణ

చిన్నమండెం : పింఛన్ల పంపిణీలో భాగంగా మండల కేంద్రంలోని రాజీవ్ కాలనీకి చెందిన మునిస్వామిశెట్టి అనే పింఛన్‌దారుడు అనారోగ్యంతో కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. మహిళా వలంటీర్ అరుణ కడప రిమ్స్‌కు వెళ్లి అతనికి పింఛన్ అందజేసింది. దీంతో మునిస్వామిశెట్టి కుటుంబీకులు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉన్నత పాఠశాలకు వాటర్ ప్లాంట్ మంజూరు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఏపీఎండీసీ నిధులు ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరైనట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఓజీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో ఉన్నత పాఠశాలకు వాటర్ ప్లాంట్ మంజూరు చేయించారన్నారు. మండలంలోని జిల్లేలమడక, జె.వడ్డిపల్లి (ఏకవీరమ్మ గుడి), గ్రామ చావిడి ఉన్నత పాఠశాలకు వాటర్ ప్లాంట్ మంజూరు చేయాలని తాను ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డికి దరఖాస్తు చేశానని చెప్పారు. ఇందుకు ఎండీ స్పందించి ఉన్నత పాఠశాలకు ఏపీఎండీసీ ఫౌండేషన్ నిధులతో ఉన్నత పాఠశాల విద్యార్థులకు వాటర్ ప్లాంట్ మంజూరు చేసినట్లు తెలిపారు.

6, 7వ తేదీల్లో ఆసర్ల గంగమ్మ తిరునాల



గాలివీడు : మండలంలోని నడింపల్లి బలిజపల్లె మధ్యలోని శావతి నదీ తీరాన వెలసిన ఏటిగడ్డ శ్రీ ఆసర్ల గంగమ్మ తిరునాల ఈనెల 6,7వ తేదీలలో జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6వ తేదీ గురువారం సద్దల కూడు నైవేద్యం అమ్మవారికి సమర్పించి అర్ధరాత్రి అలంకరించిన చాందినీ బండ్లు, కోలాటం, చెక్కభజనలతో నిండు తిరునాలగా మారి భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారని, శుక్రవారం ఉదయం బోనాల రూపంలో భక్తులు అమ్మవారికి మొక్కులు రూపంలో చెల్లించుకుంటారన్నారు.

నివాళి

లక్కిరెడ్డిపల్లె : మండల కేంద్రానికి చెందిన రామాంజనేయులు సోమవారం సాయంత్రం రాయచోటి రింగ్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మంగళవారం లక్కిరెడ్డిపల్లెలోని మృతుడి స్వగృహానికి మృతదేహాన్ని తరలించారు. న్యాయవాది ఎంఎల్ రామచంద్రారెడ్డి వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామాంజనేయులు మృతదేహానికి పలువురు నివాళి అర్పించారు. మృతుడు రామాంజనేయులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. అనంతరం అంత్యక్రియల కోసం మృతదేహాన్ని సొంతూరు కలిచెర్లకు తీసుకెళ్లారు.

నేడు పౌర్ణమి ధ్యానం

రాయచోటి టౌన్ : నేడు ఆత్మజ్ఞానం పొందడానికి పౌర్ణమి ధ్యానం నిర్వహిస్తున్నట్లు రాచవీడు పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ సభ్యులు తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణ పరిధిలోని ఎస్ఎన్ కాలనీలోని శ్రీ షిరిడీ సాయిబాబ మందిరంలో డోన్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ ధ్యానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా నల్లగంగమ్మ జాతర

రామసముద్రం: మండలంలోని చెంబకూరు పంచాయతీ పాతూరు దళితవాడలో మంగళవారం పెద్ద ఎత్తున గంగమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు అభిషేక కార్యక్రమాలు చేపట్టి, పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పూజలు చేశారు.

వైభవం.. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవం

శ్రీ రామ నామస్మరణతో ఏకశిలా నగరం మార్మోగింది. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను దేదీప్యమానంగా అలంకరించి వాహన సేవలు నిర్వహించారు. ఉదయం భక్త జనుల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ రామచంద్రుడు మోహిని అలంకరణలో మాఢ వీధులలో విహరించారు. సాయంత్రం భక్త జన సందోహం నడుమ సీతారాముడు లక్ష్మణ సమేతుడై గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. కాగా నేడు(బుధవారం) వెన్నల వెలుగుల్లో జరిగే సీతారామ కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు పంపిణీ చేసేందుకు తలంబ్రాలు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు.

– ఒంటిమిట్ట



విద్యుద్దీపాలంకరణలో కల్యాణ వేదిక ముందు భాగం





చిన్నారులు, మహిళల కోలాట ప్రదర్శన



కేరళ వాయిద్య బృంద ప్రదర్శన

నేడు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం

పెనగలూరు : మండలంలో నేడు బుధవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ద్వారా సంఘాల మహిళలకు మంజూరు చేసిన ఆసరా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. మండలానికి రూ. 3.75 కోట్లు నిధులు మంజూరైనట్లు వారు తెలిపారు. వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరుకానున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కొండూరు విజయ్‌రెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి మహిళలు, డ్వాక్రా సంఘాల మహిళలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనాలని తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

చిట్వేలి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి కీ.శేలు చౌడవరం రంగారెడ్డి జ్ఞాపకార్థం కుమారులు నరసింహారెడ్డి, సురేంద్రరెడ్డిలు పుస్తకాలు, బీరువాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ తమ తండ్రి రంగారెడ్డి గ్రంథాలయానికి వెళ్లేవారని, ఆయన జ్ఞాపకార్థం పుస్తకాలు, బీరువా వితరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. అలాగే పాఠశాలకు ఎలాంటి అవసరం ఉన్నా తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఏబీఎస్ ప్రసాద్, సీహెచ్ఎస్ ఎన్ఆర్ఐ కమిటీ గౌరవ సలహాదారు ఎంపీ నరసారెడ్డి, ప్రధాన కార్యదర్శి గాడి ఇంతియాజ్ అహ్మద్, సభ్యులు శివారెడ్డి, నరసింహా నాయుడు, కృష్ణవంశీ రెడ్డి, ఉపాధ్యాయులు కరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తక వితరణ చేస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌కు స్పందన

నందలూరు(రాజంపేట) : ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌కు విశేష స్పందన లభిస్తోందని టీబీ మెడికల్ ఆఫీసర్ డా.సృజన అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో టీబీ నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. టీబీ లక్షణాలును గుర్తించే పనిలో ఏఎన్ఎం, ఆశాలు ఉన్నారన్నారు. టీబీ రోగులకు పౌష్టికాహారం అందించేందుకు దాతలు ముందుకొస్తున్నారన్నారు. 25 నుంచి 21 రోజులు పాటు ఎంఎల్‌హెచ్‌పీలు టీబీపై కాంపేయిన్ చేయాలన్నారు. హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో టీబీపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. సమావేశంలో టీబీ సూపర్‌వైజరు పిల్లి జయప్రకాశ్ వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో సమీక్షిస్తున్న డా.సృజన

అందరి సహకారంతోనే క్షయ వ్యాధి నిర్మూలన

సంబేపల్లె : మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది మండలంలోని 13 మంది టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్నట్లు సంబేపల్లె వైద్యులు సూర్యనారాయణరెడ్డి, భగవద్గీతలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వైద్యుడు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతోనే క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చని చెప్పారు. మిక్షయమిత్ర కార్యక్రమం ద్వారా సంబేపల్లె మండల వ్యాప్తంగా ఉన్న క్షయవ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి నిత్యావసర సరుకులతోపాటు పౌష్టికాహారం అందించామన్నారు. టీబీ వ్యాధి సోకిన వారికి వైద్యం అందించినప్పుడు వారికి పౌష్టికాహారం ఎంతో అవసరం కాబట్టి దాతలు ముందుకు వచ్చి టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవాలని కోరారు.



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో తనిఖీ

మదనపల్లె : పట్టణంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో జిల్లా డీఎంహెచ్ఓ కొండయ్య, మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మి, జిల్లా ఇమ్యునిటీ అధికారి ఉషశ్రీ, రెండు బృందాలుగా తనిఖీ నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ చికిత్సలపై ఆడిట్ నిర్వహించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలో సాధారణ కాన్పులను సిజేరియన్ కాన్పులుగా నమోదు చేసి ఆరోగ్యశ్రీలో బిల్లులు దండుకుంటున్నట్లు ఆరోపణలు రావడంతో జిల్లా వైద్యాధికారులు ఆడిట్ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో కొండయ్య మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ విభాగంలో నిధుల వినియోగంపై వార్షిక ఆడిట్‌లో భాగంగా ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించి వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆడిట్‌లో లోపాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ సేవలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను మరింతగా ప్రజలకు చేర్చే బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలత, డాక్టర్ ఆంజనేయులు, వెంకటశివ, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ ఆసుపత్రిలో ఆడిట్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టుల భర్తీకి మంగళవారం మున్సిపల్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరిగాయి. మున్సిపల్ మేనేజర్ రాధ, ఆర్ఓ పెంచలయ్య, ఆర్ఐ మల్లికార్జునలు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. ఖాళీ పోస్టులకు మొత్తం 20మంది దరఖాస్తు చేసుకోగా అందులో 19మంది హాజరయ్యారు. అధికారులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్‌లను పరిశీలించారు. ఎంపిక చేసిన వారికి త్వరలో నియామక పత్రాలను అందజేస్తామని కమిషనర్ గంగాప్రసాద్ తెలిపారు.

భూరక్ష పథకంతో సంపూర్ణ హక్కులు

కలకడ : వైఎస్సార్ జగనన్న భూరక్ష తో రైతులకు వారి భూముల సంపూర్ణ హక్కు, రక్షణ కలుగుతుందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పోతువారిపల్లె రెవెన్యూ గ్రామం పరిధిలో డిజిటల్ సర్వే చేసిన భూమికి తహసీల్దార్ రాము, రెవెన్యూ బృందం చూపిన హద్దుల మేరకు భూ రక్ష రాతిని ఏర్పాటు చేశారు. సమగ్ర భూరక్ష పథకం ప్రకారం సాగు భూమిని రైతులకు అన్ని రకాలుగా రికార్డులు, ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ఇకపై తప్పుడు ధ్రువపత్రాలు చెల్లవని, ఆస్తి స్థిర విలువతో అన్ని చోట్ల ఒకే రికార్డు, అదే రుజువులు ఉంటాయని తెలియజేశారు.

మామిడి యాజమాన్య పద్ధతులపై శిక్షణ

కలికిరి: మామిడి యాజమాన్య పద్ధతులపై మండలంలోని గుట్టపాళెం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎంవీ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం మామిడిని పండు ఈగ ఆశించే అవకాశాలు అధికంగా ఉన్నందున ముందస్తు యాజమాన్య పద్ధతులు, ఫ్రూట్ కవర్‌ల వినియోగంతో పంట నాణ్యతతో పాటు పండు ఈగ, అకాల వర్షాల నుంచి రక్షణ పొందవచ్చని వివరించారు. అనంతరం వరి, టమాటా యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు.

ఓటమి భయంతోనే తప్పుడు కేసులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటమి భయంతో తమ అధినేత రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు బనాయిస్తోందని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ప్రతిపక్షం లేకుండా చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

రాయచోటి అర్బన్ : 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సాయికుమార్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం డీఈఓ కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ పది పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపడుతున్నట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు మాటల చెప్పడం తప్పా ఆచరణలో ఎక్కడా కనపడటం లేదన్నారు. రాయచోటి మాసాపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక విద్యార్థి ఓఎంఆర్ షీట్‌ను బయటకు తీసుకెళ్లి కాల్చివేస్తుంటే అక్కడున్న ఇన్విజిలేటర్లు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏమి చేస్తున్నారంటూ వారు ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు పరీక్షల పట్ల పూర్తిస్థాయి అవగాహన కల్పించకపోవడమే ఇలాంటి సంఘటనలకు కారణమన్నారు. కోడూరు, రాజంపేట, మదనపల్లె పట్టణాల్లోని పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ప్రైవేటు ఉపాధ్యాయులు లేకుండా చూడాలని వారు అధికారులను డిమాండ్ చేశారు. అనంతరం ఈ మేరకు డీఈఓ కార్యాలయం ఏడీ ప్రసాద్‌బాబుకు వారు వినతిపత్రం సమర్పించారు.



డీఈఓ కార్యాలయం ఏడీకి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ, ఐఎఫ్ఎస్‌ల నేతలు

నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరు

రాయచోటి అర్బన్ : పాలకులు అనుసరిస్తున్న నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు అందరూ సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ పాలనతో దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయన్నారు. దేశ ఆర్థిక సంపదను దోచుకుని విదేశాల్లో దాచుకున్న ఆర్థిక నేరగాళ్లకు బకాయిలు రద్దు చేస్తూ సామాన్యులపై మాత్రం మోయలేని భారాలు మోపుతున్నారంటూ మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్‌లు అదానీ, అంబానీల ఆదాయం పెంచేందుకు పని చేస్తోందే తప్ప దేశాభివృద్ధికి ఏమాత్రం పాటుపడటం లేదన్నారు. బీజేపీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా త్వరలో దేశ్‌బచావో – బీజేపీ హఠావో నినాదంతో దేశవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న కేంద్రాన్ని ప్రశ్నించకపోవడం తగదన్నారు. కేంద్ర-రాష్ట్రాల అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ సాగిస్తున్న పోరులో అందరూ పాల్పంచుకోవాలంటూ కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు క్రిష్టప్ప, సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, సాంబశివ, మురళి, మండెం సుధీర్‌కుమార్, సుమిత్ర, విశ్వనాథనాయక్, కోటేశ్వరరావు, జ్యోతిచిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ఓబులవారిపల్లె : మండలంలోని తల్లెంవారిపల్లె గ్రామం సమీపంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు మంగళవారం రైల్వేకోడూరు ఏడీఈ బాలాజీ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాదెల పంచాయతీకి 33 కేవీ నూతన సబ్‌స్టేషన్ మంజూరైందని, ఇందుకోసం స్థలం పరిశీలించి ప్రణాళికలు పంపినట్లు తెలిపారు. అనుమతులు రాగానే సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపడతామని ఆయన తెలిపారు. అలానే తల్లెంవారిపల్లె గ్రామంలో విద్యుత్ దీపాలు, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నిరెడ్డి గురువురెడ్డి, చిన్నిరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏడీఈ బాలాజీ

ప్రణాళికే విజయానికి తొలిమెట్టు

వైవీయూ : సానుకూల దృక్పథం, మొక్కవోని ఆత్మవిశ్వాసం, ప్రణాళికబద్ధమైన సన్నద్ధత ఉన్నప్పుడే పోటీపరీక్షల్లో విజేతలుగా నిలుస్తారని వైవీయూ వీసీ ఆచార్య జింక రంగజనార్దన పేర్కొన్నారు. మంగళవారం వైవీయూలోని సెంటర్ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ ఆధ్వర్యంలో ఏపీపీఎస్సీ గ్రూప్–2 ఉద్యోగ పరీక్షల శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఏపీపీఎస్సీ సభ్యులుగా పనిచేసిన వీసీ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. పరీక్షల సన్నద్ధత, షెడ్యూలు అమలుచేస్తూ నాణ్యమైన మెటీరియల్ చదవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య , ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి , వైవీయూ సెంటర్ ఫర్ కాంపిటీషన్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ డాక్టర్ నాగుల అంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో పోటీపరీక్షల విభాగం సమన్వయకర్త మనోజ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ ఆచార్య జింక రంగజనార్దన

'సురభి' మినీ ఆడిటోరియం ప్రారంభం

జిల్లా చరిత్రను విశ్వవిఖ్యాతం చేసి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన సురభి నాటక సమాజం రాబోయే తరానికి గుర్తిండిపోవాలని వీసీ రంగజనార్దన పేర్కొన్నారు. వైవీయూలోని హ్యూమానిటీస్ భవనంలో నూతన సమావేశ మందిరాన్ని 'సురభి మినీ ఆడిటోరియం'గా నామకరణం చేసి రిజిస్ట్రార్ ,ప్రిన్సిపాల్‌తో కలిసి ప్రారంభించారు. లలితకళల విభాగం ఆచార్యులు డా. మూల మల్లికార్జునరెడ్డి , ఆర్ట్స్ విభాగం డీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పండుగకు వేళాయె



యోగా నేర్పిస్తున్న శిక్షకులు



క్యారమ్ ఆడుతున్న మహిళలకు సూచనలు చేస్తున్న శిక్షకులు

- వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఏర్పాటుకు సన్నాహాలు
- మే 1 నుంచి 31 వరకు శిక్షణ
- 50 క్రీడాంశాల్లో శిక్షణ

మదనపల్లె సిటీ : వేసవికాలం వచ్చిందంటే చాలు వేసవి శిక్షణ శిబిరాల కోసం విద్యార్థులు ఎదురు చూస్తుంటారు. గత ఏడాది కాస్త ఆలస్యంగా ప్రారంభమైనా ఈ సారి పక్కా ప్రణాళికలతో క్రీడా పండుగ నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉచితంగా క్రీడా శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 5 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. క్రీడా శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, అంతర్జాతీయ, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న సీనియర్ క్రీడాకారులు ఈ శిబిరాలు నిర్వహించేందుకు అర్హులు. నెల రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు ధ్రువీకరణ పత్రం అందించనున్నారు.

పాఠశాల మైదానాల్లో..

పాఠశాల, కళాశాల సెలవులతో బోసిగా మారే మైదానాలు వేసవి శిక్షణ శిబిరాలతో కళకళలాడనున్నాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మైదానాలు ఇందుకు వేదికగా మారనున్నాయి. వ్యాయామ ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో శిబిరాలు నిర్వహించనున్నారు.

వేసవి సెలవులంటేనే శిక్షణ శిబిరాలు :

ఏటా పాఠశాలలకు వేసవి సెలవులంటేనే గుర్తుకొచ్చేది క్రీడా శిబిరాలు. విద్యార్థులు బయట తిరిగి ఎండలకు అనారోగ్యానికి గురికాకుండా ఎంతగానో ఉపయోగపడతాయి. క్రీడలపై ఇష్టమున్న వారికి ఈ శిబిరాలు ఓ మెట్టులా ఉపకరిస్తాయి. అందుకే తల్లిదండ్రులు సైతం పిల్లలను ఈ శిబిరాలకు పంపేందుకు ఆసక్తి చూపుతారు. దాదాపు నెల రోజుల పాటు క్రీడాకారులు మెలకువలు నేర్చుకుంటారు. గత ఏడాది మదనపల్లెలో హాకీ, పుట్‌బాల్, రాయచోటిలో క్రికెట్, కబ్బడ్డీ, రాజంపేటలో బ్యాల్‌బాడ్మింటన్, క్రికెట్, పీలేరులో యోగా వంటివి శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఈసారి 50 క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో శిబిరంలో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు శిక్షణ ఇవ్వనున్నారు.

క్రీడాంశాలివే..

హాకీ, పుట్‌బాల్, ఖోఖో, బాస్కెట్‌బాల్, రోప్‌స్కిప్పింగ్, యోగా, కరాటే, తైక్వాండో, క్రికెట్, ఫెన్సింగ్ బాల్ బాడ్మింటన్‌తో పాటు పలు క్రీడలు వేసవి శిక్షణ శిబిరంలో నేర్పిస్తారు.

అక్రమ మద్యం ధ్వంసం

ములకలచెరువు: సర్కిల్ పరిధిలోని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం బాటిళ్లను మండల కేంద్రంలో మంగళవారం ధ్వంసం చేశారు. మదనపల్లి ఈఎస్ మధుసూదన్, ఏఈఎస్ రాధాకృష్ణ సమక్షంలో 2019–2022 వరకు పట్టుబడిన రూ.12 లక్షలు విలువజేసే కర్ణాటక మద్యం, 530 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక చెప్పారు.